

ఇద్దరు ఉపాధ్యాయులకు దేహశుద్ధి

పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

- 8లో..



ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం 38/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు వై.పాలెంలో మంత్రి సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించనున్న మండలాల కన్వీనర్లు, గృహసారధుల సమావేశంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశానికి ఆయా మండలాల్లోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నవోదయలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఒంగోలు: జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2024–25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులకు గడువు తేదీని ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఒంగోలు జవహర్ నవోదయ సమితి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే గడువు విధించారని, దానిని తాజాగా ఈ నెల 25 వరకు విద్యాలయ సమితి పొడిగించినందున ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల కొనసాగింపునకు దరఖాస్తులు

ఒంగోలు: ప్రకాశం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్టు పద్ధతిన 2022–23 సంవత్సరం నుంచి కొనసాగుతున్న అధ్యాపకుల నుంచి 2023–24 సంవత్సరానికి పునరుద్ధరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి 31 నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారంతా ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

చీమకుర్తి విద్యార్థికి బ్రాంజ్ మెడల్



పుత్తూరి అంబరీష్

చీమకుర్తి: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో చీమకుర్తి విద్యార్థి పుత్తూరి అంబరీష్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ముఖ్యకార్యదర్శి జీ నవీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన అండర్–20 జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో అంబరీష్ ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ప్రకాశం జిల్లాకు రెండో స్థానం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా అంబరీష్‌ను కోచ్‌లు అభినందించారు.

'ఆడుదాం ఆంధ్ర' గ్రామసభలు నిర్వహించాలి

ఒంగోలు సిటీ: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించి గ్రామస్థాయిలో సభలు నిర్వహించి తగిన ప్రచారాన్ని కల్పించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 2న క్రీడా పోటీలను ప్రారంభించి 35 రోజుల పాటు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడా పోటీలకు అవసరమైన సౌకర్యాలు, పరికరాలు, క్రీడాకారులకు భోజన వసతి, రవాణా సదుపాయాలు, క్రీడా మైదానాలు బాగు చేయడం వంటివాటిపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ పోటీల్లో ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని, అందుకోసం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపిక చేసిన క్రీడా ప్రాంగణాలను పరిశీలించి అవసరమైతే వాటిని అభివృద్ధి చేయాలని ఎంపీడీవోలు, కార్యదర్శులు, డ్వామా అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొనేందుకు తగిన రవాణా సదుపాయాలు కల్పించాలని ఉపరవాణా కమిషనర్‌కు సూచించారు. అలాగే, నియోజకవర్గ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు తగిన వసతులు కల్పించేందుకు ప్రభుత్వ వసతి గృహాలను ఎంపిక చేయాలని చెప్పారు.క్రీడా పోటీల నిర్వహణలో లోటుపాట్లు తెలుసుకునేందుకు అన్ని అంశాల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న మాక్ పోటీలు నిర్వహించాలన్నారు. గ్రామ, మండలస్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలన్నింటినీ సంబంధిత ప్రజాప్రతినిధుల సహకారంతో జరిపేందుకు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు ఆదేశాలివ్వాలని జెడ్పీ సీఈవో, డీపీవోకు సూచించారు.

డబుల్ ప్రక్షాళన

గత ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో తెలుగుదేశం పార్టీ తొక్కని అడ్డదారుల్లేవు. ఎన్నో కుట్రలు, కుతంత్రాలకు తెరతీసింది. అందులో దొంగ ఓట్లు ప్రధానమైనవి. వాటిని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా.. పారదర్శకంగా ఎన్నికలు జరగాలన్న లక్ష్యంతో అధికార పార్టీ నేతలు అధికార యంత్రాంగాన్ని కలిసి ఓటరు జాబితాలో అక్రమాలు తొలగించాలని కోరుతున్నారు. తన నియోజకవర్గంలో 18 వేల డబుల్, దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని సరిచేయాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కోరడంతో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన ముమ్మరం చేసింది. నిష్పక్షపాతంగా జాబితా తయారు చేసే పనిలో పడింది.

- కదిలిన అధికార యంత్రాంగం
- నాడు టీడీపీ అధికారం కోసం కుట్రలు
- కనిగిరి నియోజకవర్గంలో 18 వేల డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు
- వీటిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుర్రా వినతి
- క్షేత్రస్థాయిలో వెలుగు చూస్తున్న నిజాలు
- బీఎల్వోలపై బెదిరింపులకు దిగుతున్న టీడీపీ శ్రేణులు
- నిష్పక్షపాతంగా జాబితా తయారీలో బీఎల్వోలు నిమగ్నం
- 21 నాటికి పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన చేస్తాం : ఆర్డీఓ



ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహిస్తున్న ఆర్డీఓ అజయ్‌కుమార్

కనిగిరి రూరల్: నియోజకవర్గంలోని కనిగిరి పట్టణంతో పాటు ఆరు మండలాల్లో 296 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 98,562 గృహాల్లో 2,37,559 ఓటర్లు ఉన్నారు. అందులో దాదాపు 18 వేల డబుల్, దొంగ ఓట్లు ఉన్నాయని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తన వద్ద ఉన్న ఆధారాలు సమర్పించారు. దీంతో అధికారులు పరిశీలన ప్రారంభించారు. 296 మంది బీఎల్వోలు, 29 మంది సూపర్‌వైజర్లతో ఇంటింటి ఓటర్ల పరిశీలన చేస్తున్నారు. కనిగిరి పట్టణంతో పాటు పామూరు. పీసీ పల్లి, సీఎస్ పురం, హెచ్‌ఎం పాడు, వెలిగండ్ల మండలాల్లో ఒకే వ్యక్తికి రెండుమూడు చోట్ల ఓటు ఉండగా, ఇప్పటికే 84,316 గృహాలను, 1,99,016 మంది ఓటర్లను పరిశీలించినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా కనిగిరి పట్టణంలో ఒక్కొక్క పోలింగ్ బూత్‌లో సుమారు 50 నుంచి 60 వరకు డబుల్ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని ఓ బీఎల్వో సాక్షికి వివరించారు. పట్టణంలోని ఒకే వ్యక్తి రెండు, మూడు వార్డుల్లో, హెచ్‌ఎం పాడు, వెలిగండ్ల మండలానికి చెందిన వారి ఓట్లు అక్కడ, కనిగిరి మున్సిపాలిటీలోని వార్డుల్లో ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది. పీసీ పల్లి, పామూరు మండలాల్లో ఉన్న వారు స్థానికంగా ఓటు కలిగి గుంటూరు, విజయవాడ, తెలంగాణ ప్రాంతాల్లో కూడా ఓట్లు కలిగి ఉన్నారని గుర్తించారు. సీఎస్ పురం మండలానికి చెందిన వ్యక్తుల ఓట్లు స్థానికంగా ఉండటంతో పాటు పామూరు, బెంగళూరు, పూణే, విజయవాడ, కర్ణాటక, హైదారాబాద్ ప్రాంతాల్లోనూ ఉన్నట్లు బీఎల్వోల పరిశీలనలో వెలుగుచూస్తున్నాయి.

టీడీపీ హయాంలో భారీ అక్రమాలు...

నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన పాపాల ప్రక్షాళనకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. నియోజకవర్గంలో వలస ఓటర్లు అధికంగా ఉన్నారు. అయితే తాత్కాలిక మైగ్రేషన్ ద్వారాన్‌వారికి కల్పిస్తున్న ఓటు హక్కును అసరా చేసుకుని, శాశ్వత వలసవాసులైన టీడీపీ నేతలు, వారి సానుభూతిపరులు కూడా కనిగిరిలోనూ, వారు వ్యాపారంగా స్థిరపడిన ప్రదేశాల్లోనూ ఓటు హక్కు పొందుతున్నారు. 2014, 2019 ఎన్నికలకు ముందు జరిగిన ఓటర్ల జాబితా సవరణల్లో వీటి గురించి అంతగా పట్టించుకోకుండా అప్పటి పాలకులు డబుల్ ఓట్లను మరింత ప్రోత్సహించారు. ఎన్నికల నిబంధనావళికి, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారు. ఒక నివేదిక ప్రకారం కేవలం మన రాష్ట్రంలో కనిగిరితో పాటు ఇతర జిల్లాల్లో,నియోజకవర్గాల్లో ఉండి డబుల్ ఓట్లు కలిగిన వారు సుమారు 10 వేల మంది ఉండగా, కనిగిరితో పాటు ఇతర రాష్ట్రాల్లో రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారు 8 వేల మంది ఉన్నట్లు తేలింది. వాస్తవానికి బీఎల్వోల క్షేత్ర స్థాయి పరిశీలనలో వాటి సంఖ్య మరింత అధికంగా ఉందని విశ్వసనీయంగా తెలుస్తోంది.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ (ఫైల్)

బీఎల్వోలకు టీడీపీ శ్రేణుల బెదిరింపులు...

ఓటర్ల జాబితాలపై సమగ్ర పరిశీలనకు వెళ్లిన బీఎల్వోలను టీడీపీ నేతలు, సానుభూతిపరులు తమ ఓట్లు తొలగిస్తే ఒప్పుకోమంటూ బెదిరింపులకు దిగుతున్నారని తెలిసింది. పీసీపల్లి, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఒక్కో గ్రామంలో సుమారు 80 నుంచి 100 వరకు డబుల్ ఓట్లు ఉన్నట్లు బీఎల్వోలు తేల్చారు. అయితే వారికి కనిగిరి నియోజకవర్గంలో ఓటు హక్కు కావాలా.. లేక గుంటూరు, విజయవాడ, పూణేల్లో కావాలా అనేది తేల్చుకోవాలని చెప్పారు. డబుల్ ఓటర్ల చాయిస్ మేరకే వ్యవహరించాలని బీఎల్వోలకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి



ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలన్నదే మా అభిమతం. అందుకే నియోజకవర్గంలో 18 వేల డబుల్ ఓట్లు ఉన్నాయన్న నివేదికను అధికారులకు అందజేశా. నిష్పక్షపాతంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించా. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నీతినిజాయితీ, పారదర్శకమైన ఓటర్ల జాబితాతో తాము ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాం. టీడీపీ అడ్డదారుల్లో అధికారంలోకి రావాలనే కుట్రతో ఓటర్ల జాబితాలో దొంగ, డబుల్ ఓట్లు చేర్పించి అక్రమాలకు పాల్పడింది. బీఎల్వోలు తప్పు చేసినా, డబుల్ ఓట్ల తొలగింపులో అక్రమాలకు పాల్పడినా, బంధు ప్రీతి చూపించినా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా.

– బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎమ్మెల్యే, కనిగిరి

సమగ్రంగా సర్వే...



క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా సవరణకు ఫారం 6, 7, 8పై సమగ్రంగా పనిచేయాలని బీఎల్వోలను ఆదేశించాం. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రతిపాదన, ఇచ్చిన నివేదిక మేరకు స్పెషల్ డ్రైవ్ పక్కాగా చేపట్టాం. ఎక్కువగా డీఎస్ఈ (డెమోగ్రాఫి కల్లి సిమిలర్ ఎంట్రీస్) ఉన్నట్లు తెలుస్తోంది. వాటిని సమగ్రంగా పరిశీలించి డబుల్, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తాం. ఓటర్ల జాబితాను ఈ నెల 21లోగా నిష్పక్షపాతంగా తయారు చేసేందుకు బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలిచ్చాం. బీఎల్వోలు అవకతవకలకు పాల్పడినా, తప్పులు చేసినా శాఖాపరమైన చర్యలు కచ్చితంగా తీసుకుంటా.

– తోట అజయ్‌కుమార్, ఆర్డీఓ, కనిగిరి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలినేని

- జిల్లాలోని పలు సమస్యలపై సమీక్ష



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ప్రకాశం భవన్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం సాయంత్రం కలిశారు. ఒంగోలు నియోజకవర్గంలోని పలు సమస్యలతో పాటు జిల్లాలోని విషయాలను కలెక్టర్ దృష్టికి బాలినేని తీసుకెళ్లారు. ప్రధానంగా ఒంగోలు నగరంలో పేదలకు ఇవ్వనున్న ఇంటి స్థల పట్టాల విషయంపై కూలంకషంగా బాలినేని చర్చించారు. ప్రైవేటు భూముల కొనుగోలు కార్యక్రమం పూర్తయిందని కలెక్టర్ వివరించారు. పేదలకు పట్టాలిచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్‌కు బాలినేని సూచించారు. బాలినేని వెంట పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎస్పీ అగ్రహారానికి సచివాలయం



చీమకుర్తిలో హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరెడ్డి (ఫైల్)

కురిచేడు: మండలంలో ఇప్పటి వరకు 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అయితే, బోధనంపాడు సచివాలయానికి దాని పరిధిలోని ఎస్‌ఎస్పీ అగ్రహారం ప్రజలు 12 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పాతకోట వెంకటరెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చీమకుర్తిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి కాంస్య విగ్రహాల ఆవిష్కరణకు వచ్చిన సమయంలో వారు సమస్యను వివరించారు. హెలిప్యాడ్ వద్ద వెంకటరెడ్డి కూడా కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసే అవకాశం కల్పించారు. ఫలితంగా ప్రస్తుతం అగ్రహారం గ్రామానికి నూతన సచివాలయాన్ని మంజూరు చేయించారు. దీంతో మండలంలో గ్రామ సచివాలయాల సంఖ్య 12కు చేరనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకటరెడ్డికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడ్కో లబ్ధిదారులను మోసం చేసిన టీడీపీ

- 14,400 మంది వద్ద డబ్బు కట్టించుకుని 4 వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం
- పేదల కోసం ఎంత ఖర్చయినా భరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సిద్ధం
- అర్హత ఉంటే చాలు.. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: టిడ్కో ఇళ్ల పేరిట నిరుపేదలైన లబ్ధిదారులను టీడీపీ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో గోపాల్‌నగర్ మూడో లైన్ ఎక్స్‌టెన్షన్, పరిసర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావుతో కలిసి గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు నగరంలోని 14,400 మంది లబ్ధిదారుల వద్ద ఇళ్ల నిర్మాణం కోసం డబ్బు కట్టించుకుని 4 వేల ఇళ్ల నిర్మాణాలను మాత్రమే ప్రారంభించి కనికట్టు చేశారని బాలినేని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరుపేదల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం ఎంత ఖర్చయినా వెచ్చించి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. 5వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఒంగోలు నగరంలోనే ముందున్నారన్నారు. గోపాల్‌నగర్, కమ్మపాలెంలో శక్తికి మించి అభివృద్ధి చేస్తున్నామని, కులమతాలకు, వర్గాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న గొప్ప నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కొన్ని సమస్యల వల్ల స్థానిక బట్టీల రోడ్డు ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించి నేరుగా కమ్మపాలేనికి రోడ్డు కనెక్షన్ ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ పని చేయలేకపోయారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి ముంగిటకే వచ్చి చేరుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలేవీ ఇక్కడ అడ్డంకిగా లేవని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన గురించి బాలినేని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఈదర సురేష్, యనమల నాగరాజు, నాగం శేషయ్య, తాడి కృష్ణలత, పీడీసీసీబీ మాజీ చైర్మన్ కండె శ్రీనివాసులు, పురిణి ప్రభావతి, గొర్రెపాటి శ్రీనివాసులు, కావటి రవికుమార్, చింతగుంట్ల సువర్ణ, జే పున్నయ్య, బి.మరియమ్మ, పసుపులేటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, బొమ్మినేని మురళి, అబ్దుల్ రజాక్, షేక్ అబ్దుల్ ఖుద్దూస్, 5వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణరెడ్డి, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్‌రావు, బొట్ల సుబ్బారావు, సాదం విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖుద్దూస్, ఆవుల సురేంద్ర, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం వెంకటేశ్వర్లు, కఠారి ప్రసాదు, వాణి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిలో సీఐడీ సోదాలు

ఒంగోలు టౌన్: స్థానిక మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో అవకతవకలపై సీఐడీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, తదితర విభాగాల అధికారులు ఒంగోలు చేరుకుని స్థానిక కర్నూలు రోడ్డులోని మార్గదర్శి మెయిన్ బ్రాంచ్‌లో పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి నెల్లూరు సీఐడీ డీఎస్పీ విజయకుమార్ కూడా తన సిబ్బందితో చేరుకుని తనిఖీలు చేశారు. నిధుల మళ్లింపులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు రెండు బృందాలుగా రికార్డులను తనిఖీ చేశారు. పలు కీలకమైన డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు వివిధ అంశాల గురించి బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావును ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేక అతను నీళ్లనమిలినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు వ్యతిరేకంగా చిట్‌ఫండ్ పేరుతో సేకరించిన డిపాజిట్లకు సంబంధించిన రికార్డులను అధికారులు సేకరించారు. సుమారు ఆరు గంటలపాటు కొనసాగిన ఈ తనిఖీల్లో ఆర్థిక మోసాలపై అనేక కీలక ఆధారాలు లభ్యమైనట్లు తెలిసింది. శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించడానికి ముందే మార్గదర్శికి చెందిన ఇద్దరు న్యాయవాదులను కార్యాలయంలో సిద్ధంగా ఉంచారు. అయితే, సీఐడీ డీఎస్పీ విజయకుమార్ వచ్చీరాగానే వారిని బయటకు పంపించాలని మేనేజర్‌ను ఆదేశించారు. దాంతో వారిని బయటకు పంపించారు. సీఐడీ దాడులు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో ఈనాడు సిబ్బంది మార్గదర్శి వద్ద కాపుకాశారు. సోదాలు జరుగుతున్నంత సేపు ఈనాడు సిబ్బంది ఆ కార్యాలయం బయటే ఉన్నారు. వారికి మార్గదర్శి సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వచ్చారు.



మార్గదర్శిలో తనిఖీలు చేస్తున్న సీఐడీ అధికారులు

క్లుప్తంగా

55 మందిపై కేసులు నమోదు

ఒంగోలు: మోటారు వాహనాల చట్టం నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 55 మందిపై కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ సుశీల తెలిపారు. గురువారం నగరంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్రరావు, కె.జయప్రకాష్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపేవారిని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపేవారిని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు.

విచారించి నివేదిక సమర్పించండి

పుల్లలచెరువు: పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన సంఘటనపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి స్పందించారు. పాఠశాలలో జరిగిన సంఘటనపై మూడు రోజుల్లో పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించాలని విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ప్రకాశం భవనంలో 'ఎంప్లాయీస్ గ్రీవెన్స్'

ఒంగోలు సిటీ: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 18వ తేది శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రకాశం భవనంలో ఎంపాయీస్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

20 నుంచి బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్

ఒంగోలు సిటీ: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న న్యూ రెడ్‌క్రాస్ భవన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగ అవకాశాలున్న ఈ కోర్సులో చేరాలనుకునే యువత జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 40 మందికి మాత్రమే అవకాశం ఉందని, వివరాలకు 91547 73116 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు దేహశుద్ధి

- అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రుల వద్ద వాపోయిన విద్యార్థులు
- ఆవేశంతో చేయిచేసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు
- పుల్లలచెరువులో ఘటన


పాఠశాల వద్ద గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు


ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

పుల్లలచెరువు: పాఠశాల విద్యార్థుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారికి గ్రామస్తులు, తల్లిదండ్రులు దేహశుద్ధి చేసిన సంఘటన పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడి సహకారంతో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు, తల్లిదండ్రులు బుధవారం పాఠశాలకు వెళ్లి పద్ధతి మార్చుకుని సక్రమంగా ఉండాలని హెచ్చరించారు. ఆ ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి బుధవారం రాత్రి కొందరు విద్యార్థులను వెంట తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లి మిగిలిన ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు అడ్డుకుని ఈ విషయాన్ని రచ్చ చేయవద్దు.. పాఠశాలలో మాట్లాడుకుందామని చెప్పి అక్కడి నుంచి పంపించివేశారు. ఇద్దరు ఉపాధ్యాయులు గురువారం ఉదయం పాఠశాల వాచ్‌మెన్‌ను అడిగి పాఠశాల తాళాలు తీసుకుని విద్యార్థులు రాసినట్లుగా అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు అక్రమ సంబంధం ఉందని రాసి ఆ చీటీలను ఫిర్యాదుల బాక్సులో వేశారు. పాఠశాల సమయంలో ఈ విషయం తెలుసుకున్న మహిళా ఉపాధ్యాయురాలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసి పీఈటీపై చేయిచేసుకున్నారు. పాఠశాలలో గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు, తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిని బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై నిలదీశారు. అతను చెప్పిన సమాధానం సక్రమంగా లేకపోవడంతో దేహశుద్ధి చేశారు. పాఠశాలలో గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్సై కోటయ్య వెంటనే పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలి గానీ.. విద్యార్థుల భవిష్యత్‌ను పాడుచేయవద్దని సూచించారు. జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయంపై హెచ్ఎం ఉమామహేశ్వరరావును వివరణ కోరగా, ఆ ఇద్దరి ఉపాధ్యాయుల కారణంగా పాఠశాలలో రోజూ గొడవలు జరుగుతున్నాయని, పాఠశాలకు చెడ్డపేరు వస్తోందని తెలిపారు. వారికి మెమోలు ఇచ్చామని, విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్

యర్రగొండపాలెం: పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు గురువారం ఆదేశాలు జారీచేశారు. ఆ పాఠశాల పీడీ కె.బాలునాయక్, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ..తోటి ఉపాధ్యాయులు, బాలికలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిద్దరిపై ఆ పాఠశాలలో చదువుతున్న బాలికల తల్లిదండ్రులు గురువారం పోలీసులకు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డీఈఓ విచారించి వారిద్దరిని సస్పెండ్ చేశారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


పాకల ఎన్నికల ప్రచారంలో వరికూటి

సింగరాయకొండ: పాకల గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నిత్యం మీకు అందుబాటులో ఉంటూ వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలో ఉన్న కుర్రు ప్రసన్నకుమార్‌కు కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. పాకల పంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారంలో గురువారం రెండో రోజు వరికూటి విస్తృతంగా ప్రచారం చేశారు. వరికూటి మాట్లాడుతూ గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచుకో దాచుకో అన్న సూత్రాన్ని పాటించారే తప్ప గ్రామాభివృద్ధి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. పాకల బీచ్‌ను పర్యాటకానికి అనుకూలంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వివరించారు. పాకలలో పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయని, నిర్మాణం పూర్తయితే పాకలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా వైద్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్ రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కొండూరి అంకయ్య, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి, గొల్లపోతు గోవర్ధన్, తాతయ్య, వాయిల పున్నయ్య, బుజ్జమ్మ, దామతోటి శ్రీనివాసులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండలో 16 వార్డుకు పోటీ చేస్తున్న షేక్ సాబీరా, మూలగుంటపాడులో 10వార్డుకు పోటీ చేస్తున్న సయ్యద్ అల్తాఫ్‌లు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గౌను గుర్తుపై సాబీరా, స్టూలు గుర్తుపై అల్తాఫ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమే మేనిఫెస్టో

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, అధ్యాపకులు

పొదిలి: ప్రజల ఆశల, ఆకాంక్షల, సమస్యల పరిష్కారాల ప్రతిరూపంగా 2024 మేనిఫెస్టో రూపుదిద్దుకుంటుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జగన్‌మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి వేల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్న ధ్యేయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశారని కొనియాడారు. విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాలు దేశ స్థాయిలో పేరు పొందాయన్నారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ అధ్యాపకులు, విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తారావాణి, కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ ఎల్.పద్మారావు, అధ్యాపకులు పీవీ రమణారెడ్డి, యుఎల్.నరసారెడ్డి, ఎం.శాంతి కెజియా, పి.సుజాత, వై.యాస్మిన్, బి.సావిత్రి, యేసయ్య, ఎం.శాంతిప్రియ, ఆర్ఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి తీవ్ర గాయాలు


ఆర్టీసీ బస్సు కింద ఇరుక్కుపోయిన ద్విచక్రవాహనం

టంగుటూరు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్ర గాయాలు కాగా..అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మండల పరిధిలోని తూర్పునాయుడుపాలెం కొనేరు సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు తూర్పునాయుడుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల సాయి గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు, అదే గ్రామానికి చెందిన మెత్తాళ శ్యామ్ ఇంటర్ చదువుతున్నాడు. సాయిని పాఠశాలలో వదిలేందుకు శ్యామ్ ద్విచక్ర వాహనంపై పోతుండగా మార్గమధ్యంలో కోనేరు వద్ద టంగుటూరు నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న వారిని బలంగా ఢీకొట్టి ద్విచక్రవాహనంతో పాటు కొంత మేర ఈడ్చుకెళ్లింది. ప్రమాదంలో శ్యామ్ తల, చేతులకి తీవ్రగాయాలు కాగా స్పృహ కోల్పోయాడు. సాయి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరిని రిమ్స్‌కు తరలించగా శ్యామ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్‌–1 ఫలితాల్లో మహిళల సత్తా


హాసిని


వసంత

కొండపి: కొండపికి చెందిన మామిళ్లపల్లి హాసిని గురువారం విడుదలైన ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 ఫలితాల్లో సత్తా చాటి మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో కార్యదర్శి ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆమె తండ్రి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ఐటీడీఏలో అసిస్టెంట్ ట్రైబల్ సంక్షేమ అధికారిగా పనిచేస్తున్నారు. ఆమె తమ్ముడు శ్రావణ్‌కుమార్ పొన్నలూరు మండల తహసీల్దార్‌గా, తండ్రి వెంకటేశ్వర్లు కొండపి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి గ్రూప్‌–1 అధికారిగా ఎంపికవడంపై హాసినిని అభినందిస్తున్నారు.

ఒంగోలు టౌన్: ఏపీపీఎస్సీ ఫలితాల్లో ఒంగోలుకు చెందిన ఓ.వసంత గ్రూప్ వన్ కేటగిరిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హెల్త్ అండ్ మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు ఎంపికయ్యారు. వసంత తండ్రి ఓ.దుర్గా ప్రసాద్ ఒంగోలు స్పెషల్ బ్రాంచి సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సుజాత గృహిణి. వసంత ఢిల్లీ యూనివర్శిటీలో డిగ్రీ చదివారు.

తాగునీటి అవసరాలకే సాగర్ జలాలు

ఒంగోలు సిటీ: దర్శితో పాటు పొదిలి సీపీడబ్ల్యూఎస్ స్కీముల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీటిని పొదుపుగా తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మార్ధాన్ అలీ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో దర్శి, పొదిలి స్కీంలకు, దర్శి దగ్గర ఎన్ఏపీ స్కీంలో నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా నీరు అందుతుందన్నారు. ఈ ఎస్ఎస్ ట్యాంక్‌ని నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా వచ్చే నీటితో నింపుతామని తెలిపారు. ఈ స్కీంల ద్వారా దర్శి నగర పంచాయతీ 46 గ్రామాలు సహా పొదిలి నగర పంచాయతీతో పాటు 29 గ్రామాలకు మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు. దర్శి చెరువులోని నీరు అడుగంటిపోవడంతో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున జూన్ నెల చివరి నుంచి అమల్లో ఉన్న షెడ్యూల్ ప్రకారం దర్శి, పొదిలి సీపీడబ్ల్యూఎస్ స్కీంకింద ఆధారపడిన ఆవాస ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేయడంలో అవాంతరం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల 20 నుంచి ఈ నెల 15 వరకు సాగర్ జలాలతో చెరువు నింపామని, ఆ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

ఒంగోలు: ఎయిడెడ్ నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కన్వర్షన్ పొందిన 30 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు గురువారం సాయంత్రం స్థానిక డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 66 పాఠశాలల్లో 95 పోస్టులను ఖాళీగా చూపించారు. హాజరైన 30 మంది ఉపాధ్యాయులు ఈ 95 పోస్టుల్లో 30 పోస్టులను కోరుకోవడంతో బదిలీ ప్రక్రియ ముగిసింది. వీరందరికీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ డీఈఓ వీఎస్ సుబ్బారావు, ఏడీ సురేఖవాణి, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు, సూపరింటెండెంట్లు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జరిగింది.

150 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

వెలిగండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం మినీలారీని స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మినీలారీలో 150 బస్తాలు రేషన్ బియ్యం తీసుకొని వెలిగండ్లకు చేరుకోగానే పోలీసులు లారీని ఆపి పరిశీలించారు. మినీలారీలో రేషన్‌బియ్యం ఉండటంతో లారీని, డ్రైవర్ భీమనబోయిన సురేష్‌ను అదుపులోనికి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వలంటీర్ మృతి

- 12 రోజుల పాటు మృత్యువుతో పోరాటం


ప్రదీప్‌చంద్ర (ఫైల్)

నాగులుప్పలపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వలంటీర్ గురువారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..మండలంలోని రాపర్ల సచివాలయ పరిధిలోని చవటపాలెం గ్రామానికి చెందిన ముట్లూరి ప్రదీప్ చంద్ర (27) గత 4 ఏళ్లుగా సచివాలయ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నడు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ పింఛన్లు అందించే క్రమంలో అమ్మనబ్రోలులో ఉన్న ఒక వ్యక్తికి పింఛన్ ఇచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరగా..అమ్మనబ్రోలు సమీపంలోకి వచ్చేలోగా అతి వేగంగా ట్రాక్టర్ రావడం గమనించి తప్పించే క్రమంలో రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయాడు. ప్రమాదంలో ప్రదీప్‌చంద్రకు తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. క్షతగాత్రున్ని 108లో ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం మంగళగిరి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ప్రదీప్ చంద్ర మృత్యువుతో పోరాడి గురువారం వేకువజామున మరణించాడు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నేత మృతి


కోటిరెడ్డి(ఫైల్)

పొదిలి: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి చెందాడు. ఈ ఘటన దర్శిలోని పెట్రోల్ బంకు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఈగలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మేడం కోటిరెడ్డి(57) గురువారం రాత్రి పొదిలి నుంచి ఈగలపాడు మోటారు సైకిల్‌పై వెళుతుండగా దర్శి రోడ్డులోని ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోటిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోలేరమ్మ పొంగళ్లకు ఆహ్వానించి వెళుతూ..

గ్రామంలో ఆదివారం పోలేరమ్మ పొంగళ్లు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో పొదిలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుండగా, అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో పాటు పార్టీ నాయకులను కార్యక్రమానికి ఆహ్వానించిన పది నిముషాలు గడవక ముందే మృత్యువాత పడటం అందరినీ తీవ్రంగా కలిచివేసింది. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కోటిరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.